మాజీ సైనికులకు సన్మానం


బంగారుపాళెంలో మాజీ సైనికులను సన్మానిస్తున్న నాయకులు


ఐరాల : మాజీ సైనికులను సన్మానిస్తున్న ఎంపీపీ, సర్పంచ్, అధికారులు


పూతలపట్టు మండలంలో..

బంగారుపాళెం: దేశ రక్షణ కోసం పనిచేస్తున్న సైనికులను గౌరవించాలని పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌రాజా అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా సోమవారం బంగారుపాళ్యానికి చెందిన మాజీ సైనికులు నాగరాజనాయుడు, కమలాపలతి, వీరాస్వామి, సుబ్రమణ్యం, బాబును స్థానిక గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి, ఉపసర్పంచ్ కామరాజు, గ్రామ కార్యదర్శి శంకరయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సైనికుల త్యాగాలు మరువలేనివి

ఐరాల: మండలంలోని నాగంవాండ్లపల్లె సచివాలయం వద్ద నా భూమి– నా దేశం కార్యక్రమం నిర్వహించారు. శిలాఫలాకాన్ని ఆవిష్కరించారు. అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ ప్రమిదలతో నివాళులర్పించారు. సచివాలయ ఆవరణలో మొక్కలు నాటారు. యదర్లపల్లె, నాగంవాండ్లపల్లెకు చెందిన మాజీ సైనికులు హేమాద్రి, భాస్కర్‌ను ఘనంగా సత్కరించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ మోహన్, సర్పంచ్ శ్రీనివాసులు, ఉప సర్పంచ్ మునిరాములు, వైఎస్సార్‌సీపీ నేత దేవేంద్ర, ఈఓపీఆర్డీ భవాని, పంచాయతీ కార్యదర్శి శ్యామల, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పూతలపట్టు మండలంలో..

పూతలపట్టు: మండలంలోని వేపనపల్లె, యం.బండపల్లె పంచాయతీలలో సోమవారం నాభూమి–నాదేశం, నేల తల్లికి వందనం, వీరులకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మొక్కలు నాటారు. ఎంపీడీఓ గౌరి మాట్లాడారు. వైస్‌ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, సర్పంచులు మణి, వైస్ సర్పంచ్ జ్యోతి , పంచాయతీ కార్యదర్శులు రజని, హేమలత తదితరులు పాల్గొన్నారు.

తవణంపల్లె మండలంలో..

తవణంపల్లె: మండలంలోని దిగువ తడకర, సరకల్లు, జి.గొల్లపల్లె, తొడతర, అరగొండ, ముత్తుకూరు, జొన్నగురకల, ఎగువ తడకర, ఈచనేరి, పల్లెచెరువు, పట్నం, తెల్లగుండ్లపల్లె, మైనగుండ్లపల్లె, ఉత్తరబ్రాహ్మణపల్లె, ఎ.గొల్లపల్లె, కారకాంపల్లె, పుణ్యసముద్రం గ్రామాల్లో నా భూమి–నా దేశం శిలాఫలకాలను స్థానిక ప్రజాప్రతినిధులు ఆవిష్కరించారు. ప్రతి సచివాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్, తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సి.హరిరెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైద్యుల భర్తీకి ఇంటర్వ్యూలు


ఇంటర్వ్యూ చేస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతిదేవి

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం చిన్నపిల్లల వైద్యుల భర్తీకి అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహించారు. మూడు రోజులకు క్రితం ఎన్‌హెచ్‌ఎం కింద జిల్లాలో ఐదు పోస్టులు ఖాళీ ఉండగా, దరఖాస్తులు ఆహ్వానించారు. ఈ మేరకు సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతిదేవి అభ్యర్థులను ఇంటర్వ్యూ చేశారు. ఎంపికైన వారు బాధ్యతతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఎంఓ హర్షవర్ధన్ ఉన్నారు.

స్వాతంత్య్ర వెలుగులు


చిత్తూరు రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విద్యుత్ లైట్లు

చిత్తూరు కార్పొరేషన్: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు ప్రభుత్వ కార్యాలయాలకు జాతీయ జెండాలోని రంగులను ప్రతిబింబిస్తూ విద్యుత్ లైట్లను ఏర్పాటు చేశారు. అందులో భాగంగా చిత్తూరులోని రైల్వేస్టేషన్, జెడ్పీ కార్యాలయానికి ఏర్పాటు చేసిన లైట్లు చూపరులను ఆకట్టుకుంది.

గో సంరక్షణ ట్రస్ట్‌కు విరాళం


అధికారులకు విరాళమిస్తున్న చెన్నైవాసులు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో గో సంరక్షణ ట్రస్ట్‌కు రూ.లక్ష విరాళాన్ని సోమవారం చెన్నైకు చెందిన శ్రీనివాస్, రాజేష్ ఆలయ అధికారులకు అందజేశారు. దాతలకు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి, స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ రంగస్వామి, ఇన్‌స్పెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సులో పూతలపట్టు వాసి


అంతర్జాతీయ సదస్సులో ప్రేమ్‌కుమార్

పూతలపట్టు: పూతలపట్టు దళితవాడకు చెందిన ప్రేమ్‌కుమార్ ఇటీవల అంతర్జాతీయ సదస్సులో తన పరిశోధన పత్రాన్ని సమర్పించారు. ఆయన ఈ పరిశోధనకు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీర్స్, సర్క్యూట్ అండ్ సిస్టమ్స్ సొసైటీకి చెందిన 1500 యూఎస్ డాలర్స్ ట్రావెల్ గ్రాంట్ అవార్డును అందుకున్నారు. సోమవారం హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ యాజమాన్యం ప్రేమ్‌కుమార్‌ను అభినందించింది. ఆయన కేంద్రీయ విశ్వవిద్యాలయంలో పరిశోధనలు చేశారు.

కంటి ఆపరేషన్లకు 32మంది ఎంపిక

బంగారుపాళెం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్, చెన్నై శంకర్ నేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 65 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, వీరిలో 32 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వారిని చెన్నైలో కంటి ఆపరేషన్లు నిర్వహించి, మందులు, కంటి అద్దాలు పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకుడు మురళీకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ అమరావతి, ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశ రాజధానికి మన మట్టి


జెండాను ప్రదర్శిస్తున్న సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, ఉద్యోగులు

చిత్తూరు కార్పొరేషన్: మన మట్టి దేశరాజధానికి వెళ్తుందని జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం జెడ్పీ కార్యాలయంలో ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా కార్యాలయ అధికారులు, ఉద్యోగులతో కలిసి జాతీయ జెండా ను ప్రదర్శించారు. మన మట్టి–మన దేశం కార్యక్రమంలో పంచాయతీ, మండల, నియోజకవర్గ, జిల్లాస్థాయి లో కలశంలో సేకరించిన మట్టిని రా ష్ట్రానికి పంపుతామన్నారు. అక్కడ నుంచి దేశరాజధాని ఢిల్లీకి మట్టిని పంపుతామన్నారు. అమరవీరుల త్యాగాల ను స్మరించుకుని ప్రతిఒక్కరూ తమ ఇంటిపై జెండాలను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. డీపీఆర్సీ డీసీ షణ్ముగం, ఎంపీడీఓ బాలజీ, ఏఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

మాతృభూమికి వందనం


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న సర్పంచ్ రజనీకాంత్

గుడిపాల: దేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా ఆజాదీ కా అమృత్ మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం అన్ని పంచాయతీల్లో మేరా మట్టీ–మేరా దేశ్(నాభూమి–నాదేశం) పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. సచివాలయాల వద్ద శిలాఫలకాల ఆవిష్కరణ, మొక్కలు నాటడం, అమరవీరుల త్యాగాలను స్మరించుకుని వారికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ రజనీకాంత్, ఉపాధిహామీ జేఈ మధు, టెక్నికల్ అసిస్టెంట్లు చంద్రప్రకాష్, హంసవేణి పాల్గొన్నారు.

శిశు మరణాలు జరగకుండా చూడండి


సమావేశంలో మాట్లాడుతున్న డీఐఎఓ రవిరాజు

చిత్తూరు రూరల్: క్షేత్రస్థాయిలో వైద్యులు, ఏఎన్‌ఎం, ఆశావర్కర్లు సమన్వయంతో పని చేసి..శిశుమరణాలు జరగకుండా చూడాలని డీఐఓ రవిరాజు ఆదేశించారు. చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం శిశుమరణాలపై సమీక్ష నిర్వహించారు. శిశుమరణాలు జరిగిన ప్రాంతాల్లోని వైద్యబృందాన్ని విచారించారు. మరణాలకు గల కారణాలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం శిశుమరణాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ఉషశ్రీ, లత, మీనా కుమారి, మునిమోహన్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ రోడ్డు పనుల పరిశీలన


పాత బస్టాండు పరిసరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు అర్బన్: నగరంలోని గాంధీ కూడలి నుంచి షర్మన్ పాఠశాల వరకు ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ రోడ్డు పనులను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, నగర కమిషనర్ అరుణ సోమవారం సాయంత్రం పరిశీలించారు. స్మార్ట్ రోడ్డు ఏర్పాటులో భాగంగా రహదారి విస్తరణ, డివైడర్ల ఏర్పాటుతో పాటు ఇతర సాంకేతిక అంశాలను ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో కలిసి పరిశీలించారు. స్మార్ట్ రోడ్డు ఏర్పాటుతో అందుబాటులోకి వచ్చే సౌకర్యాలను కమిషనర్ ఈ సందర్భంగా ఎమ్మెల్యేకి వివరించారు. అంతకుముందు కమిషనర్, ఎమ్మెల్యే నగరంలోని పాత బస్టాండ్ ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడి సమస్యలపై చర్చించారు. ట్రాఫిక్ డీఎస్పీ విష్ణు రఘువీర్, ఎంఈ వెంకట ప్రసాద్, ఏసీపీ రామకృష్ణుడు, డీఈ రమణ, నగరపాలక అధికారులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

చిత్తూరు రూరల్: ఆర్టీసీ చిత్తూరు రీజియన్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఆ కార్యవర్గ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపా రు. చీఫ్ అడ్వైజర్‌గా ఎస్.కుమార్, అడ్వైజర్‌గా ఉలగనాథన్, అధ్యక్షుడిగా దశరథన్, కార్యదర్శి గా జయప్రకాష్, సంయుక్త కార్యదర్శిగా సోమశేఖర్, ఉపాధ్యక్షులుగా రాజేంద్ర, జీవనాథం, ఇతర సభ్యులను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

కొమ్మలను తొలగించారు

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వెనుక వైపు వీధిలో చెట్టుకొమ్మలను ట్రాన్స్‌కో సిబ్బంది తొలగించారు. ‘ప్రమాదకరంగా విద్యుత్ లైన్లు’ అని సోమవారం సాక్షి దినపత్రిక మన చిత్తూరు పేజీలో వార్త వచ్చింది. దీనిపై స్పందించిన ఏఈ బాలచంద్ర, లైన్‌మన్ ప్రతాప్ సిబ్బందితో కలిసి వీరభద్రకాలనీ, నాగాలమ్మగుడి వీధిలో విద్యుత్ లైన్లకు తగులుతున్న చెట్టుకొమ్మలను తొలగించారు.

వార్డు మెంబరుగా కిరణ్‌కుమార్ ఏకగ్రీవం

పూతలపట్టు: తేనేపల్లె–1వ వార్డు మెంబర్‌గా పి.కిరణ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయనకు పంచాయతీ ఎన్నికల అధికారి చంద్రశేఖర్ డిక్లరేషన్‌ను అందజేశారు.

మురుగు కాలువ నిర్మాణ పనులు ప్రారంభం

ఐరాల: మండల కేంద్రంలో సోమవారం మురుగు కాలువ నిర్మాణ పనులు ప్రారంభించినట్లు సర్పంచ్ గుణవతి తెలిపారు. ఇటీవల ఐరాల పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబుకు స్థానిక ప్రజలు మురుగు కాలువలు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే చొరవతో సచివాలయం నిధులు రూ.5 లక్షలతో పనులు చేపడుతున్నట్లు సర్పంచ్ చెప్పారు.

సబ్‌స్టేషన్ సాంకేతిక చార్జ్

చిత్తూరు కార్పొరేషన్: పూనేపల్లెలోని టిడ్కో గృహాల కోసం దాదాపు రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించిన సబ్‌స్టేషన్‌ను సోమవారం సాంకేతిక చార్జ్ చేశారు. వీటి ద్వారా 2,800 గృహాలకు విద్యుత్ సరఫరా చేయనున్నట్లు ట్రాన్స్‌కో ఎస్‌ఈ కృష్ణారెడ్డి తెలిపారు. ప్రస్తుతం విద్యుత్ సరఫరా, పరికరాల పనితీరు, లోటుపాట్లు పరిశీలన కోసం టెక్నికల్‌గా సబ్‌స్టేషన్‌ను చార్జ్ చేశామన్నారు. లబ్ధిదారులు సర్వీసులు తీసుకోవడం పూర్తయితే ఫుల్ చార్జ్ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఈ పద్మనాభపిళ్లై, మహేశ్వర్‌రెడ్డి, డీఈ శేషాద్రి రెడ్డి, శ్రీనివాసమూర్తి, సతీష్, లక్ష్మి, ఏఈలు లోకేష్ రెడ్డి, మోహన్‌శెట్టి, సుధాకర్ పాల్గొన్నారు.

స్పందన అర్జీల పరిష్కారానికి కృషి

తవణంపల్లె: స్పందన వినతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డి ఆదేశించారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన స్పందన నిర్వహించారు. ఇంటి స్థలం ఆక్రమణపై ఆయనకు ఫిర్యాదు అందింది.

పూతలపట్టు: తహసీల్దార్ విజయభాస్కర్ నిర్వహించిన స్పందన కార్యక్రమంలో పలు వినతులు అందాయి. భూ సమస్యలు, రేషన్ కార్డుల్లో పేర్ల మార్పు, జనన ధ్రువపత్రాలు, మ్యుటేషన్ కోసం ప్రజలు అర్జీలు ఇచ్చారు.

‘ఉత్తమ సహకార సంఘంగా ఎర్రచెరువుపల్లె కేంద్రం’

పూతలపట్టు: మండలంలోని ఎర్రచెరువుపల్లె ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి ప్రథమ ఉత్తమ సంఘం అవార్డు లభించిందని ఆ సంఘ చైర్మన్ దొరస్వామిరెడ్డి తెలిపారు. 2022–23 సంవత్సరం ఏపీసీఓబీ వజ్రోత్సవాల్లో భాగంగా ఇటీవల విజయవాడలో రాష్ట్ర వ్యవసాయ సహకార మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి, జిల్లా సహకార బ్యాంకు అధ్యక్షులు కె.రెడ్డెమ్మ చేతుల మీదుగా ఉత్తమ సంఘం అవార్డు అందుకున్నట్లు తెలిపారు.

భారీ జాతీయ పతాకంతో ర్యాలీ


జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

బంగారుపాళెం: విద్యార్థులు దేశభక్తి భావాలు కలిగి ఉండాలని మంగళపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజ్యలక్ష్మి అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం గ్రామంలో స్కూలు నుంచి ఉపాధ్యాయులు, విద్యార్థులు 77 అడుగుల పొడవుతో ఉన్న జాతీయ జెండాతో ర్యాలీ చేశారు. హెచ్‌ఎంతోపాటు జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు అరుణ్‌శివప్రసాద్ మాట్లాడారు. విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించుకునేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. విద్యార్థులు దేశాన్ని, జాతీయ జెండాని గౌరవించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంజీవి, పిళ్లారప్ప, ప్రేమకృష్ణ, ధనశేఖర్, మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు, భారతి ఎస్‌ఎంసీ చైర్మన్ యాగమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

‘స్పందన’లో పది వినతులు

చిత్తూరు అర్బన్: నగరపాలక కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో మొత్తం పది వినతులు అందినట్లు నగర కమిషనర్ జె.అరుణ తెలిపారు. కమిషనర్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. సమస్యలు పరిష్కరించాలని పలువురు నగర ప్రజలు వినతిపత్రాలు అందించారు. ప్రజల వినతులపై ఆయా శాఖల అధికారులు సత్వరం విచారించి చర్యలు తీసుకోవాలన్నారు. స్పందన కార్యక్రమంలో ఇంజినీరింగ్ 4, టీపీఓ 4, రెవెన్యూ 2 చొప్పున మొత్తం 10 వినతులు అందాయన్నారు.